## గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

■ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఏప్రిల్ 16 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జూన్ 9 న నిర్వహించనున్న గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికతో సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశమందిరంలో టీఎస్‌పీఎస్సీ ద్వారా నిర్వహించే గ్రూప్-1 పరీక్షల నిర్వహిణ సన్నాహక సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు కేటాయించే అభ్యర్థులకు అనుగుణంగా కామారెడ్డి పట్టణంలో 12 పరీక్షా కేంద్రాలను గుర్తించామని తెలిపారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. అభ్యర్థులను నిశితంగా పరిశీలించి బయోమెట్రిక్ విధానం ద్వారా పరీక్ష హాల్‌లోకి అనుమతించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ కేంద్రాలు మూసివేయించాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, డీఈవో రాజు, సహాయ పరీక్ష కమిషనర్ నీలం లింగం, జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి షేక్ సలాం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, తహసీల్దార్ జనార్దన్, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ, అధికారులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కామారెడ్డి, ఏప్రిల్ 16 : అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మూడో రోజు మంగళవారం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది సయ్యద్ మహమూద్ అలీ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా అక్రమ కలప దందా

- అడవుల్లో దర్జాగా చెట్ల నరికివేత
- వంట చెరుకు పేరుతో వ్యాపారం
- నిత్యం వందల సంఖ్యల్లో వాహనాలు, సైకిళ్లపై కలప తరలింపు
- అక్రమార్కులకు అటవీశాఖ అధికారుల అండదండలు?
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు



మోటర్ సైకిళ్లపై బాన్సువాడకు కలపను తరలిస్తున్న దృశ్యం

రాత్రి సమయంలో వాహనంలో కలపను అక్రమంగా తరలిస్తున్న వ్యాపారులు

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 16 : బాన్సువాడ మండల పరిధిలో అక్రమ కలప దందా జోరుగా సాగుతున్నది. బాన్సువాడ అటవీశాఖ కార్యాలయానికి కూత వేట దూరంలో ఈ అక్రమ కలప వ్యాపారం జరుగుతుండడం గమనార్హం. అడువులను రక్షించాల్సిన అటవీశాఖ అధికారులు చూసి, చూడనట్లు వ్యవహరిస్తుండడంతో దట్టంగా ఉన్న అడవులు అంతరించిపోతున్నాయి. మండలంలోని బోర్లం క్యాంపు, నర్సాపురం, మొండిసడాక్ గండి అడవుల నుంచి నిత్యం అక్రమంగా కలపను తరలిస్తున్నా అటవీశాఖ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారు. దీంతో కలప వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలు అన్న చందంగా మారింది. వంట చెరుకు పేరుతో అడవుల నుంచి నిత్యం సైకిళ్లు, మోటర్‌సైకిళ్లు, వాహనాల్లో కలప తరలిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకోకుంటే అడవులు అంతరించిపోయే ప్రమాదం ఉందని గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అక్రమ కలప వ్యాపారం సాగుతున్నదిలా..**

గ్రామాల్లో వంట చెరుకు పేరుతో సైకిళ్లు, మోటార్ సైకిళ్లపై తీసుకొచ్చే వారితో వ్యాపారులు చేతుల కలిపారు. గ్రామాల నుంచి ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో అటవీ ప్రాంతంలోకి వెళ్లి పచ్చని చెట్లను నరికేస్తున్నారు. ఆ కలపను తీసుకొచ్చి గ్రామాలకు సమీపంలో నిల్వ చేస్తున్నారు. కలప వ్యాపారులు రాత్రి 11 గంటల తర్వాత పెద్దపెద్ద వాహనాలు తీసుకొచ్చి డంపింగ్ చేసిన కలపను బాన్సువాడ తరలించి అమ్ముకుంటున్నారు. సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యహరించడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

**కరువైన అధికారుల పర్యవేక్షణ..**

అక్రమంగా అడవుల్లో చెట్లను నరికి దర్జాగా తీసుకెళ్లి విక్రయిస్తున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కరువవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బాన్సువాడలోని అటవీశాఖ డివిజనల్ కార్యాలయంలో అధికారులు, బీట్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. జోరుగా అక్రమ కలప వ్యాపారం నిత్యం జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని హరిత వనంగా తీర్చిదిద్దేందుకు హరితహారం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రస్తుతం అడవుల్లో ఉన్న పెద్దపెద్ద చెట్లను నరికి వేస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడడం విమర్శలకు తావిస్తున్నది. చెట్లను నరికి వేడయడంతో జంతువులు గ్రామాల్లోకి వచ్చి మృత్యువాత పడుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ కలప వ్యాపారం నిరోధించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**అక్రమంగా కలప తరలిస్తే కఠిన చర్యలు**



అడవుల్లో చెట్లను నరకడం నేరం. అక్రమ కలప రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. అక్రమ కలప తరలించడం, చెట్లను నరికే వారిపై నిఘాపెట్టి కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తాం. కలప రవాణాను అడ్డుకునేందుకు అవసరమైతే రాత్రిపూట పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తాం. అక్రమ కలపను రవాణా, చెట్లను నరికితే ప్రజలు బాన్సువాడ అటవీశాఖ కార్యాలయానికి సమాచారం అందించాలి. అడవుల సంరక్షణకు ప్రజలు సహకారించాలి.

- హబీబ్, ఎఫ్ఆర్వో బాన్సువాడ

## బాల్య వివాహం అడ్డగింత

**బాలిక కుటుంబ సభ్యులకు అధికారుల కౌన్సిలింగ్**

రెంజల్, ఏప్రిల్ 16: మండలంలోని కునేపల్లి గ్రామంలో ఓ బాల్య వివాహన్ని అధికారులు అడ్డుకొన్నారు. అనంతరం బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. నాందేడ్ జిల్లా ఉమర్‌ఖేడ్ తాలూకా డాంకీ గ్రామానికి చెందిన కృష్ణ(24)తో కునేపల్లి గ్రామానికి చెందిన ఓ బాలిక(16)తో ఈనెల 24న పెండ్లి చేయాలని కుటుంబ సభ్యులు నిశ్చయించారు. ఈ విషయం చైల్డ్‌లేబర్ టీం సభ్యులకు తెలియడంతో వారు గ్రామానికి చేరుకొని పెండ్లి ఏర్పాట్లను నిలిపివేయించారు. బాలిక కుటుంబీకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలతో జరిగే అనర్థాలను వివరించారు. 18 ఏండ్లు నిండే వరకు పెండ్లి చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ టీం సభ్యురాలు జమ్రు, చైల్డ్‌లేబర్ టీం సభ్యుడు ముజాహిత్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ప్రమీలారాణి, కార్యదర్శి కృష్ణ, అంగన్‌వాడీ టీచర్ రాధ, రెంజల్ పోలీసులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సు ఢీకొని ఒకరి మృతి

కామారెడ్డి, ఏప్రిల్ 16 : స్కూల్ బస్సు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం కామారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన మంచనపల్లి శ్రీకాంత్ (22) మంగళవారం ఉదయం 9 గంటలకు కామారెడ్డికి తన మోటర్‌సైకిల్‌పై అమ్మమ్మ సాయవ్వ, సోదరి సింధూజ కలిసి వెళ్తున్నారు. హెచ్‌పీ పెట్రోల్ పంపు, పాత ఎన్‌హెచ్ 7 రోడ్డు వద్ద విద్యానికేతన స్కూల్ బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా వేగంగా ఎలాంటి సిగ్నల్స్ లేకుండా యూటర్న్ చేస్తుండగా మోటర్‌సైకిల్‌ను ఢీకొనడంతో శ్రీకాంత్‌తోపాటు మిగతా ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. శ్రీకాంత్‌ని మొదటగా ప్రభుత్వ దవాఖానకు తరలించారని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నా రు. మృతిడి తండ్రి నాగభూషణం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

## బోరుమోటరు పరిశీలన



మండల కేంద్రంలో బోరుమోటరును పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి సతీశ్ యాదవ్

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 16 : గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి సతీశ్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో బోరు మోటర్లను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు పనికి వచ్చేలా చూడాలని అన్నారు. ఆయన వెంట ఎంపీవో రాము ఉన్నారు.

## పాఠశాలలో మౌలిక వసతుల కోసం ఆర్థిక సహాయం అందజేత



జోస్‌లుక్కాస్ మేనేజర్‌ను సన్మానిస్తున్న పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్, ఎంఈవో నాగేశ్వర్ రావు

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 16 : మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం మంగళవారం నిజామాబాద్‌లోని జోస్‌లుక్కాస్ వ్యాపార సంస్థ వారు సుమారు రూ.2 లక్షల 50 వేల సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా జోస్‌లుక్కాస్ మేనేజర్ స్మితేశ్‌ను, పీఆర్‌వో నరేందర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్, ఎంఈవో నాగేశ్వర్ రావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం చందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు హన్మాండ్లు, కార్యదర్శి భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలి

**గ్రామ పంచాయతీ కార్యదర్శులతో డీపీవో శ్రీనివాసరావు**



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాసరావు

పిట్లం, ఏప్రిల్ 16: వేసవికాలం దృష్ట్యా మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు అన్నారు. ఆయన పిట్లం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీవో మాట్లాడుతూ.. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి గ్రామంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎండలు తీవ్రమైన నేపథ్యంలో ఉపాధి హామీ పనులను ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే చేపట్టేలా చూడాలన్నారు. అత్యసవరమైతే తప్ప ప్రజలు ఎండపూట ఇండ్లలో నుంచి బయటికి రావొద్దని తెలియజేయాలన్నారు. సమావేశంలో డీఎల్పీవో నాగరాజు, ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో బ్రహ్మం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవళిక తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణంలో మార్పులు ఆందోళనలో రైతులు



డోంగ్లీలో రోడ్డు పక్కన పొద్దుతిరుగుడు పంటను సంచుల్లో నింపి పైన టర్పాలిన్లతో కప్పి ఉంచిన రైతులు

డోంగ్లీ, ఏప్రిల్ 16: వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగైదు రోజులుగా వాతావరణం పూర్తిగా చల్లబడింది. శుక్ర, శనివారాల్లో పలుచోట్ల వర్షం కురిసింది. కోతలు పూర్తయిన రైతులు తమ పంటను కాపాడుకోవడానికి నానా తిప్పలు పడుతున్నారు. మండలంలో సుమారు 450 ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంటను సాగుచేశారు. పంట నూర్పిళ్లు పూర్తయ్యాయి. దీంతో కొనుగోలు కేంద్రాల వద్దకు పొద్దుతిరుగుడు సంచులను తీసుకువచ్చారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం వద్ద పంటను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణం చల్లబడడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు తేమ శాతం రావడం లేదు. ఎండ ఉన్నప్పుడు ఎండబెట్టి, వాతావరణం మారగానే టార్పాలిన్లతో కప్పిపెడుతున్నారు. వాతావరణం అనుకూలించి, త్వరగా కొనుగోళ్లు పూర్తవ్వాలని రైతులు వేడుకుంటున్నారు.

## గురుకుల విద్యార్థులకు కంటి పరీక్షలు



గురుకుల పాఠశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 16: ఎల్లారెడ్డి పట్టణ శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. చూపు చాలా ముఖ్యమైనదని, కండ్లను కాపాడుకోవాలని వైద్య సిబ్బంది పలు సూచనలు చేశారు. అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్, ఆరోగ్య సిబ్బంది ప్రవీల, సుధ, ఇందిర, రాణి, రాజేశ్వరి, ఆశ కార్యకర్త లావణ్య, ఆప్తమాలజిస్ట్ హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### అన్నాసాగర్ జడ్పీహెచ్‌ఎస్‌లో..



విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యుడు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 16 : మండలంలోని అన్నాసాగర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. పరిసరాల శుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలని సూచించారు. వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిబిరంలో మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## డుమ్మా మాస్టారుకు మెమో

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్



ఉపాధ్యాయుడికి మెమోను అందజేస్తున్న ఎంఈవో దేవీసింగ్

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 16: సమయపాలన పాటించకుండా పాఠశాలకు డుమ్మా కొట్టిన మాస్టారుకు విద్యాశాఖాధికారులు మెమో జారీ చేశారు. మండలంలోని సీతారాంతండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాథోడ్ సంతోష్ పదిహేను రోజులుగా పాఠశాలకు హాజరు కావడం లేదు. ఈ ఏకోపాధ్యాయ పాఠశాల విషయం 'నమస్తే తెలంగాణ'లో 'ఇంట్లో టీచర్ – చెట్ల కింద విద్యార్థులు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీంతో విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఎంఈవో దేవీసింగ్ పాఠశాల ఉపాధ్యాయుడు రాథోడ్ సంతోష్‌కు మంగళవారం మెమో జారీచేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రామాంజనేయులు, సీఆర్పీ రాములు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై కూలీలకు అవగాహన



కూలీలకు అవగాహన కల్పిస్తున్న వర్డ్ స్వచ్ఛంద సంస్థ బాధ్యులు

పిట్లం, ఏప్రిల్ 16: వర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో ఉపాధి పనులు చేపడుతున్న కూలీల వద్ద సంస్థ ప్రతినిధులు మంగళవారం వెళ్లి, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది..? రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎయిడ్స్ వ్యాధి వస్తే కుటుంబం చిన్నాభిన్నం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

## ఓటింగ్ శాతం పెంపునకు కృషిచేయాలి



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 16: గ్రామాల్లో ఓటింగ్ శాతం పెంపునకు యువత, విద్యార్థులు కృషి చేయాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం కోసం అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కాలేజీలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 ఏండ్లు నిండిన వారందరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటు వేసి స్వచ్ఛమైన పాలన కోసం తమ వంతు సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశం, కాలేజీ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ మహేందర్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం



ఎల్లారెడ్డి బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 16: ఎల్లారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. స్థానిక ఇస్మాయిల్ ఫ్లవర్ మర్చంట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆర్టీసీ అధికారులు, నిర్వాహకులు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ గంగాధర్, పలువురు ప్రయాణికులు పాల్గొన్నారు.

## సీజ్ చేసిన ఇసుకకు 20న వేలం

డోంగ్లీ, ఏప్రిల్ 16: అధికారులు సీజ్ చేసిన ఇసుకకు ఈనెల 20వ తేదీన వేలం నిర్వహిస్తామని తహసీల్దార్ రేణుకాచౌహాన్ మంగళవారం తెలిపారు. మండలంలోని మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు వాహనాలను రెవెన్యూ సిబ్బంది పట్టుకొని సీజ్ చేశారు. 20న నిర్వహించే వేలంలో అవసరం ఉన్న వారు పాల్గొనాలని తహసీల్దార్ పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా తహసీల్దార్ హెచ్చరించారు.

## కొలతల ప్రకారం ఉపాధి పనులు చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సవితారెడ్డి

రామారెడ్డి, ఏప్రిల్ 16: మండలంలోని అన్నారం గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో సవితారెడ్డి, ఈజీఎస్ ఏపీవో ధర్మారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కూలీలతో మాట్లాడారు. నిర్ణీత కొలతల ప్రకారం ఫిష్‌పాండ్ తవ్వకాలు చేపట్టాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తరచు నీరు తాగాలన్నారు. ఉదయం వేళలో పని పూర్తిచేసుకోవాలని సూచించారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని గ్రామ కార్యదర్శి లింగాల సాగర్‌గౌడ్‌ను ఆదేశించారు.